షిర్డీసాయి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ గ్రామంలో షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతన మందిరం నిర్మాణానికి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. చీడిగలో బాబా భక్తులు ఎక్కువగా భజనలు, కీర్తనలు నిర్వహిస్తుంటారని వారి కోరిక మేరకు ఆలయ నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి గణేశ్ పాల్గొన్నారు.

మార్పునకు సంకేతం తూర్పు..

- కాకినాడ నుంచే రూ.3 వేల పింఛన్ల పంపిణీ ప్రారంభం
- సీఎం సభ విజయవంతానికి భారీగా తరలిరావాలి
- మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: తూర్పు మార్పునకు సంకేతమంటారు. అవ్వాతాతలకు పెన్షన్లు రూ.3 వేలకు పెంపు కాకినాడ నుంచే ప్రారంభమవుతున్నందున 3న రంగరాయ మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులు మీదుగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పిలుపు ఇచ్చారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆదివారం ఆయన సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 10 గంటలకు కాకినాడకు చేరుకుంటారని 11 గంటలకు బహిరంగ సభ ప్రారంభమవుతుందన్నారు. 12.30 గంటలకు సభ పూర్తవుతుందన్నారు. లబ్ధిదారులు పెద్ద ఎత్తున కార్యక్రమానికి వచ్చేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మన నాయకుడు వస్తున్నాడు కాబట్టి మండల, గ్రామాల్లోని నాయకులను ఆహ్వానిస్తున్నామన్నారు. కొత్త సంవత్సరంలో తొలి బహిరంగ సభ అని సూపర్ డూపర్‌గా జరగాలని, కాకినాడ సభతో ఊపు రావాలన్నారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా పెన్షన్లను ఇంటి వద్దకు తీసుకువెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు.

ఒక్క రూరల్ నియోజవర్గంలోనే 35202 పెన్షన్లను అందిస్తున్నామన్నారు. ఎన్నికల నాటికి 17 వేలు ఉన్న పింఛన్లు ఇప్పుడు 35 వేలు దాటాయన్నారు. చంద్రబాబు నాయుడు నెలకు రూ.450 కోట్లు పింఛన్ల ఇచ్చేవారని, ఇప్పుడు నెలకు రూ.2049 కోట్లు ఇస్తున్నారని, ఏటా దాదాపుగా రూ.25 వేల కోట్లు ఇస్తున్నారన్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి 5 నుంచి రూరల్ నియోజకవర్గంలో మహిళలకు ఆటల పోటీలు ఏర్పాటు చేస్తున్నామని, గ్రామ స్థాయిలో పోటీలు ఉంటాయని, బహుమతులను తాను ఏర్పాటు చేస్తున్నట్టు కన్నబాబు ప్రకటించారు. జెడ్పీటీసీలు నురుకుర్తి రామకృష్ణ, యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పేంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగంగా జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, జేఎన్‌టీయూకే వీసీ సభ్యుడు బెజవాడ సత్యనారాయణ, కడియాల చిన్నా, చింతా ఈశ్వరరావు, దూనబోయిన అరుణ, ఐ.శ్రీను, పాటి సురిబాబు తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబును కలిసిన ద్వారంపూడి

రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇరువురు నేతలు కొద్ది సేపు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన తదితర అంశాలపై చర్చించుకున్నారు.

సీఎం పర్యటన సక్సెస్ చేద్దాం

- రానున్న ఎన్నికలకు సిద్ధమవుదాం
- కార్యకర్తల సమావేశంలో ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనవరి 3వ తేదీన కాకినాడ రానున్న సందర్భంగా పర్యటనను విజయవంతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక రైస్ మిల్లర్ల అసోసియేషన్ కార్యాలయంలో ఆదివారం పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ పింఛన్‌ను రూ.3 వేలకు పెంచే కార్యక్రమంతో పాటు రాగిరెడ్డి కళాక్షేత్రం, స్కేటింగ్ రింక్, ముత్తా గోపాలకృష్ణ వారధిని సీఎం ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆర్ఎంసీ గ్రౌండ్‌లో జరిగే సభను విజయవంతం చేసే బాధ్యతను ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. మరో వంద రోజుల వ్యవధిలో ఎన్నికలు సమీపిస్తున్నందున సీఎం సభను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా సభకు హాజరయ్యే వివిధ పథకాల లబ్ధిదారులు, మహిళలకు అవసరమైన తోడ్పాటును అందించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మైనార్టీసెల్, బీసీ సెల్, వాణిజ్య విభాగాల ప్రాంతీయ సమన్వయ కర్తలు అబ్దుల్‌బషీరుద్దీన్, అల్లి రాజబాబు, పెద్ది రత్నాజీ, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రత్యేకాధికారులతో సమావేశం

కాకినాడ సిటీ: ముఖ్యమంత్రి బహిరంగ సభా వేదిక వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన సీఎం సభ జరగనున్న ఆర్ఎంసీ గ్రౌండ్ ఆవరణను అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.


నిజాయతీకి ప్రతిరూపం 'ప్రభా జోసెఫ్'

- విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: నీతి, నిజాయతీ, నిబద్ధతతో పనిచేయడం ద్వారా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.ప్రభాజోసెఫ్ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం చర్చిస్క్వేర్ ఆటస్థలం వద్ద ఏర్పాటు చేసిన ప్రభా జోసెఫ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ద్వారంపూడి ఆదివారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి మహిళా చైర్‌పర్సన్‌గా 1995–2000 సంవత్సరంలో ఆమె కాకినాడకు ఎనలేని సేవలు అందించారన్నారు. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన ఆమె సేవలకు గుర్తింపుగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం ముదావహమన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడిపల్లి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆమె హయాంలో కౌన్సిలర్లుగా పనిచేసే అవకాశం దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతా సుఖ సంతోషాలతో ఉండాలి

ప్రజలకు ఎమ్మెల్యే ద్వారంపూడి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆకాంక్షించారు. న్యూ ఇయర్ సందర్భంగా నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ మంచి జరగాలని, కొత్త సంవత్సరంలో రాష్ట్రం మరింత అభివృద్ధి, సంక్షేమం దిశగా పయనించాలన్నారు. కొత్త సంవత్సరంలో జరిగే ఎన్నికల్లో గతంలోలాగే ఇప్పుడు కూడా తనను ప్రజలు ఆదరించాలని ఆయన కోరారు.

సంక్షిప్తంగా..

రేపు స్క్వాష్ క్రీడాకారుల ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన మంగళవారం రాష్ట్ర స్థాయి అండర్–14, 17, 19 స్క్వాష్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నారు. సమాఖ్య ప్రధాన కార్యదర్శి బీవీవీఎస్‌వీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. స్థానిక జిల్లా క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. అలాగే అండర్–14, 17, 19 కురాష్ ఎంపికలు ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోతో హాజరు కావాలని రాష్ట్ర ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. స్క్వాష్ విభాగంలో ఆసక్తి ఉన్న వారు 94908 96851 నంబరులోను, కురాష్ విభాగంలో టి.శ్రీలత, వ్యాయామ ఉపాధ్యాయురాలు 70930 80576 నంబరులోను సంప్రదించాలని సూచించారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

కాకినాడ సిటీ: సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం అంగన్‌వాడీ, సమగ్రశిక్ష ఉద్యోగులు, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెలను విరమింపచేయాలని కోరుతూ ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. కాకినాడ కచేరిపేటలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దువ్వా శేషుబాబ్జీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని కోరారు.

కూరాడ సర్పంచ్ మృతికి సంతాపం

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, కరప మండలం కూరాడ సర్పంచ్ వెంకటరమణ మృతికి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సభాముఖంగా సంతాపం తెలియజేశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం నియోజవర్గంలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో తొలుత ఆయన మృతికి రెండు నిముషాలు మౌనం పాటించారు.

స్పందన, డయల్ యువర్ కమిషనర్ రద్దు

కాకినాడ సిటీ: ప్రతి సోమవారం జరిగే స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలు సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా రద్దు చేసినట్లు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాకినాడ రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదివారం రాత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని ఆరుగురికి రూ.7లక్షల చెక్కులను అందించారు.

వైఎస్సార్ సీపీకి విజయనామ సంవత్సరం కావాలి

మాజీ మంత్రి కురసాల కన్నబాబు



మాజీ మంత్రి కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: కొత్త సంవత్సరం 2024లో అడుగుపెడుతున్నాం. ఈ సంవత్సరం వైఎస్సార్ సీపీకి విజయనామ సంవత్సరం కావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆకాంక్షించారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు పలికి కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతున్నామన్నారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు, జిల్లాలోని వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ఆయన న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇది ఎన్నికల సంవత్సరమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడు గెలిచినట్టు అన్నారు. ప్రతి పేదవాడికి మంచి జరిగే సంవత్సరం వచ్చినట్టు అన్నారు. ఐదేళ్లుగా కులం, మతం చూడకుండా అర్హత ఉన్న వారందరికీ ఆయన సంక్షేమ పథకాలను అందించారన్నారు.

న్యూ ఇయర్‌కు స్వాగతం



స్వీట్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

బోట్‌క్లబ్: న్యూ ఇయర్ వేడుకలకు చిన్నా, పెద్దా వర్గాలకు అతీతంగా అంతా సమాయత్తమవుతున్నారు. స్వీట్లు, కేకులు, ముగ్గుల కొనుగోళ్లకు ప్రజలు మార్కెట్లకు రావడంతో ఆదివారం ఆయా దుకాణాలు కళకళలాడుతున్నాయి. స్థానిక నాగమల్లితోట జంక్షన్, భానుగుడి, బాలాజీచెరువుసెంటర్, అశోక్‌నగర్, గాంధీనగర్, రామారావుపేట, పెద్దమార్కెట్, జగన్నాథపురంలో ప్రత్యేక దుకాణాలు వెలిశాయి. ఇళ్ల, దుకాణాల ముందు న్యూ ఇయర్‌కు స్వాగతం పలికేందుకు రంగులతో ముగ్గులు వేసేందుకు నగరంలో రంగులు విక్రయించే దుకాణాలు కిటకిటలాడాయి.

విషెస్ అన్నీ ఆన్‌లైన్‌లోనే..

గ్రీటింగ్ కార్డులకు కాలం చెల్లిన నేపథ్యంలో కంప్యూటర్, స్మార్ట్ ఫోన్లలోనే చక్కటి సంక్షిప్త సందేశాలను ఆకర్షణీయమైన చిత్రాలపై పొందుపరచి ఆత్మీయులకు సెండ్ చేసేస్తున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విటర్ మాధ్యమాల ద్వారా వారి ఆత్మీయతను పంచుకుంటున్నారు.

రూరల్‌లో..

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ సమీపంలోని జ్యూవెల్ మెడోస్ గేటెడ్ అపార్టుమెంట్ వద్ద న్యూ ఇయర్ 2024కు ఆహ్వానం పలుకుతూ చిన్నారులు నృత్యాలతో సందడి చేశారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో విద్యార్థులు న్యూ ఇయర్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ న్యూ ఇయర్ కేక్‌ను విద్యార్థుల సమక్షంలో కట్ చేసి విషెష్ తెలియజేశారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సోమవారం ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు, అభిమానులు, పార్టీ నాయకులు, అధికారులు పెద్ద ఎత్తున హాజరయ్యే అవకాశం ఉండడంతో వారందరికీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సదుపాయం కల్పించేందుకు ఆదివారం రాత్రి నుంచి వంటలు ప్రారంభించారు.



మసీదు సెంటర్‌లో రంగులు కొనుగోలు చేస్తున్న యువతి



జ్యూవెల్ మెడోస్ వద్ద సందడి చేస్తున్న చిన్నారులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కాకినాడ: కాకినాడ జగన్నాథపురం అన్నమఘాటి సెంటర్ గాయత్రినగర్ కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.